నేత్రపర్వంగా రామలింగేశ్వరుడి పల్లకీసేవ



రామలింగేశ్వర స్వామికి పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

కీసర: కీసరగుట్ట శ్రీ భవానీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం సందర్భంగా గర్భాలయంలో కొలువైన శ్రీస్వామి వారికి అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం క్షీరాభిషేకంతోపాటు, నానావిధ పుష్పార్చ పూజలను పండితులు కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులకు నిర్వహించిన పల్లకీసేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

అభివృద్ధి పనులను కొనసాగిస్తాం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు అభివృద్ధి పనులను కొనసాగిస్తూనే ఉంటామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 3 వ వార్డులోని గోకుల్ కాలనీలో సుమారు రూ. 10 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆయా వార్డుల్లో కౌన్సిలర్ల ప్రతిపాదనల మేరకు అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోకకళావతి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నేతలు



సత్కరిస్తున్న ముత్యాలుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి

ఘట్‌కేసర్: టీ పీసీసీ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల అధ్యక్షులు ముత్యాలుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. టీ పీసీసీ అధ్యక్షుడి నివాసంలో సోమవారం ఉదయం ఆయనను కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ ముదిరాజ్, గణేశ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు సహదేవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్



మల్లెపూల
శ్రీకాంత్ యాదవ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో ప్రభుత్వం హైడ్రా పేరిట పేద ప్రజల ఇళ్లను కూల్చివేస్తుందని కొందరు పేద ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుందని జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడు పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆలోచిస్తుందని, కొందరు వ్యక్తులు ఆర్థిక, రాజకీయంగా పబ్బం గడుపుకోవడానికి చూస్తున్న మార్గాలను ఉపేక్షించబోమని, వారి అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందని, పేద ప్రజలను మభ్యపెడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, వారికి తగిన గుణపాఠం చెబుతామన్నారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మేడ్చల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా 11 మందిని ఎంపిక చేశామని మండల విద్యాధికారి వసంతకుమారి తెలిపారు. ఎస్.గాయత్రి (బాలికల పాఠశాల మేడ్చల్), జి.నరేందర్ (బాలుర మేడ్చల్), జె.ప్రభాకర్ (అత్వెల్లి), పి.శేఖర్ (పూడూర్), ఎ.కె.పెంటమ్మ (ఎల్లంపేట్), ఎస్.హిమబిందు (ఎల్లంపేట్), భాస్కర్‌రావు (పూడూర్), సి.అప్పన్న (గుండ్లపోచంపల్లి), టి.హరీష్ (అత్వెల్లి), కె.లిఖిత (డబీల్‌పూర్), ఆర్.రాందాస్ (రావల్‌కోల్ తండా)లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశామన్నారు. మంగళవారం కార్యాలయ ఆవరణలో నిర్వహించే కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేస్తామన్నారు. మండలంలో పని చేసే ఉపాధ్యాయులు సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

ఆశాలకు కనీస వేతనం
రూ. 26 వేలు అందజేయాలి

సాక్షి, సిటీబ్యూరో: ఆశాలను సేవా కార్యకర్తలుగా కాకుండా కార్మికురాలు(వర్కర్)గా గుర్తించి నెలకు కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ డాక్టరు రఘునాథ్‌స్వామికి వినతి పత్రాన్ని అందజేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 1273 మంది ఆశా వర్కర్స్ పని చేస్తున్నారని, వీరందరికి నెలకు ప్రస్తుతం రూ.9,750 మాత్రమే ఇస్తున్నారని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాళ్లు రేవతి కళ్యాణి, హేమలత పేర్కొన్నారు. కరోనా లాంటి మహమ్మారి కాలంలో కూడా ముందు వరుసలో ఉండి వారు ప్రజలకు సేవలందించారు. డబ్ల్యుహెచ్ఓ అంతర్జాతీయ సంస్థ కూడా ఆశా వర్కర్లకు గ్లోబెల్ హెల్త్ లీడర్స్ అవార్డును ప్రకటించినట్లు తెలిపారు.కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐతోపాటు సామాజిక భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. పని వేళల్లో యూనిఫామ్స్ ధరించేలా.. వాటిని అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ జిల్లా నాయకురాళ్లు రాధా, వాసంతి, రాజకుమారి, మంజు ,మంగా,సీఐటీయూ జిల్లా నేత ఉన్నీకృష్ణన్ పాల్గొన్నారు.

‘గ్రేడింగ్’తో మహిళల అభ్యున్నతి!

- మహిళా సంఘాల ఆర్థిక ప్రగతి దిశగా అడుగులు
- స్వయం ఉపాధికి ప్రత్యేక రుణాలు
  మహిళా సంఘాల పనితీరు బట్టి గ్రేడింగ్
- ప్రమాణాలు పాటించే మహిళా సంఘాలకు ప్రాధాన్యం

సాక్షి, సిటీబ్యూరో: మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మహిళా శక్తి పేరిట కొత్త కార్యక్రమాన్ని చేపట్టి మహిళా అభ్యుదాయానికి ఇందులో భాగంగా పలు వ్యాపారాలు చేసుకునేందుకు వారికే ప్రాధాన్యం ఇస్తున్నారు. బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించడమే కాకుండా స్వయం ఉపాధి దిశగా మళ్లిస్తున్నారు. సంఘాల్లో సభ్యులను అనుభవం ఉన్న రంగంలో రాణించేలా ప్రత్యేక రుణాలను సైతం మంజూరు చేస్తున్నారు.



జిల్లా	గ్రామ మహిళా సంఘాలు	సహాయక సంఘాలు	సభ్యులు
రంగారెడ్డి	788	19,209	2,06,116
మేడ్చల్	188	3,395	36,911
మేడ్చల్ (అర్బన్)	208 (ఏరియా)	7,245	72,450

● బ్యాంకుతో పాటు స్త్రీ నిధి రుణాలూ అందుతుండటంతో ఆర్థిక సమస్యలను అధిగమించే దిశగా మహిళా సంఘాల సభ్యులు ముందుకు సాగుతున్నారు. సంఘాలను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో గ్రేడింగ్ విధానాన్ని సైతం అమలు చేస్తుండటం గమనార్హం.

అంశాల వారీగా...

నగర శివారు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాలు 22,604 ఉండగా, ఇందులో 2,43,07 మంది మహిళా సభ్యులు ఉన్నారు. అలాగే, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 13 పురపాలక సంఘాల్లో 7,245 మహిళా సంఘాలు ఉండగా, ఇందులో 72,450 మంది సభ్యులు ఉన్నారు. మహిళా సంఘాలకు పని తీరును బట్టి గ్రేడింగ్ కేటాయిస్తారు. ఇందుకు 12 అంశాలను నిర్దేశించారు. వాటి ఆధారంగా ఏ, బీ, సీ, డీ, ఈ గ్రేడింగ్‌లు ఇస్తారు. ఒక్కో సంఘం 75 శాతా పైగా సాధిస్తే ఏ 70 నుంచి 75లోపు ఉంటే బీ, 60 లోపు సాధిస్తే సీ, 60 శాతం కంటే తక్కువగా ఉంటే 'డీ', అంతకంటే తక్కువగా ఉంటే ఈ అని నిర్ణయిస్తారు.

రుణాలు పొందడం...

గ్రామ మహిళా సంఘాలకు ఇప్పటి వరకు గ్రేడింగ్ విధానం అమల్లో ఉంది. ఇక నుంచి ఏ, బీ, సీ గ్రేడింగ్ ఉన్న గ్రామ సంఘాలకు మాత్రమే స్త్రీనిధి రుణాలు కేటాయిస్తున్నారు. ఇక మీదట క్షేత్రస్థాయిలో స్వయం సహాయక సంఘాలకు సైతం ఇదే నిబంధన వర్తించనుంది. గ్రేడింగ్‌లో వెనుకబడితే బ్యాంకు, స్త్రీనిధి రుణాలు అందడం కష్టంగానే ఉండనుంది.

పెరిగిన పర్యవేక్షణ...

గ్రేడింగ్ విధానం అమల్లోకి వచ్చిన కారణంగా మహిళా సంఘాలపై పర్యవేక్షణ పెరుగుతోంది. ఇప్పటికే సంఘాల సమావేశాలకు సంబంధించి అక్షాంశ, రేఖాంశాలతో కూడిన లైవ్ ఫొటో తప్పనిసరి చేశారు. దీన్ని యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటోంది. రుణ వాయిదాల రికవరీపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. గ్రేడింగ్‌లో వెనుకబడకుండా అధికారులు సంఘాల వారీగా ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని సమీక్షిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా సూచనలు కూడా చేస్తున్నారు.

సభ్యులకు ప్రయోజనాలు...

మహిళా స్వయం సహాయ సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. గ్రేడింగ్ విధానంతో సంఘాల్లో సభ్యులకు పలు ప్రయోజనాలు ఉన్నాయి. సమావేశాలు పక్కాగా నిర్వహించడంతోపాటు బ్యాంకు, స్త్రీనిధి రుణ వాయిదాలు సక్రమంగా చెల్లిస్తేనే మంచి గ్రేడింగ్ సాధించేందుకు వీలుంటోంది. అన్ని సంఘాలపై పర్యవేక్షణ పెంచుతాం.

– సాంబశివరావు, డీఆర్డీవో,
మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

బీజేపీ విశ్వబ్రాహ్మణ సెల్ కన్వీనర్‌గా సుధాకర్



రామంతాపూర్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీజేపీ విశ్వబ్రాహ్మణ సెల్ కన్వీనర్‌గా రామంతాపూర్‌కు చెందిన దర్శనాల సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ సెల్ కన్వీనర్ పూసల బ్రహ్మచారి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, శ్రీనివాస్‌చారిలకు కృతజ్ఞతలు తెలిపారు.

‘ప్రజావాణి’ ఫిర్యాదులను పరిష్కరించాలి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతి పత్రాలను స్వీకరించారు. మూడు ఫిర్యాదులు అందాయని మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వర్ రావు, డిప్యూటీ ఇంజనీర్ జి.సాయినాథ్ గౌడ్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి, టీపీవో సుకన్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణేష్ నవరాత్రి పూజలు



సాయినగర్‌లో వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు

ఘట్‌కేసర్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సాయినగర్, బ్రూక్ బాండ్ కాలనీ, స్వామి వివేకానంద స్వామి యూత్ వద్ద చైర్ పర్సన్ పావనీజంగయ్య ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద అన్నదానం చేశారు.

మేడ్చల్ మున్సిపల్ కార్యాయలంలో...

మేడ్చల్: వినాయక చవితి సందర్భంగా మున్సిపల్ సిబ్బంది కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి కౌన్సిలర్లతో కలిసి పూజలు నిర్వహించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండపంలో ఆమె గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపికారెడ్డి

అన్నదానం



పోచారం: అన్నోజిగూడలోని సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్మన్ కొండల్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమైక్యతకు చిహ్నంగా నిలిచే గణేష్ ఉత్సవాలను ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్ రవీందర్, నాయకులు కేఎం రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత నైపుణ్యంతో లక్ష్యసాధన

ఘట్‌కేసర్: విద్యార్థులు వ్యక్తిగతంగా నైపుణ్యాలను పెంపొందించుకుంటే అనుకున్న లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చని నల్లా మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేత నల్లా మల్లారెడ్డి అన్నారు. సోమవారం కాచవానిసింగారం దివ్యానగర్ నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు విషయ పరిజ్ఞానంతో పాటు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలన్నారు. కళాశాల డైరెక్టర్లు దివ్య నల్లా, నల్లా మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ డైరెక్టర్ స్నేహ నల్లా మాట్లాడుతూ... విద్యార్థుల అభివృద్ధికి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో అవగాహన కుదుర్చుకొని బీటెక్‌తో పాటు ఏకకాలంలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసే అవకాశం కల్పించామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్, నల్లా మల్లారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్ పర్సన్ సంధ్యావళి, హెచ్ఓడీ కేతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లారెడ్డి

పండగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

మేడ్చల్: ప్రజలు తమ పండగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. మేడ్చల్ పీఎస్‌లో ముస్లిం మత పెద్దలతో ఆయన పీస్ కమిటీ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయని రెండు రోజుల్లో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. అందరూ కలిసి కట్టుగా ఉండి ఎవరి మతాల ఆచారాల ప్రకారం వారి పండగలను సామరస్యంగా జరుపుకోవాలని అన్నారు. పుకార్లను నమ్మి శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ఎలాంటి చర్యలు చేపట్టవద్దని అన్నారు. అన్ని మతాల వారు సామరస్యంగా తమ పండగలను జరుపుకొని ఇతరులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు.

చెరువులను ఆక్రమించిన వారిని అరెస్టు చేయాలి

- 12న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులను ఆక్రమించి బహుళ అంతస్తులను నిర్మించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులను తక్షణమే అరెస్టు చేయడంతో పాటుఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో ఆ పార్టీ జిల్లా నాయకుడు దశరథం అధ్యక్షతన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాలమల్లేష్ మాట్లాడుతూ... జిల్లాలో అనేక ప్రాంతాల్లో చెరువుల, కుంటల బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లను రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుని, బహుళ అంతస్తులు నిర్మించారన్నారు. ప్రభుత్వ భూములను కూడా చెరబట్టారని విమర్శించారు. కబ్జాలకు గురైన చెరువులను వారి బారి నుంచి విడిపించే పనిని హైడ్రా కొనసాగించడాన్ని సీపీఐ ఆహ్వానిస్తోందన్నారు. కాప్రా చెరువు, యాప్రాల్ పరిధిలోని నాగిరెడ్డి చెరువు, బండబాయి కుంట, అల్వాల్ చిన్న రాయుడు చెరువు, కుత్బుల్లాపూర్ పరిధిలోని ఫాక్ సాగర్, బొమ్మరాసిపేట చెరువులు అక్రమణకు గురయ్యాయని, హైడ్రా కమిషనర్ తక్షణమే పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని సీపీఐ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. భారీ వర్షాలు, వరదలతో పలు జిల్లాల్లో అపార నష్టం సంభవించిందని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించి, నిధులు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని సీపీఐ నిర్ణయించిందన్నారు. జిల్లా కార్యదర్శి డి.జి.సాయిలుగౌడ్ మాట్లాడుతూ... ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలను పరిరక్షించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు దామోదర్‌రెడ్డి, ఉమా మహేశ్, కృష్ణమూర్తి, ధర్మేంద్ర, కిషన్, శంకర్‌రావు, శంకర్, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 89 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: కలెక్టరేట్ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ గౌతమ్ 89 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ... వీటిని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలోజిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



తుమ్మ చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు ఆపాలని వినతి

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని తుమ్మ చెరువు పరిధిలో నిర్మాణాలు చేస్తున్నారని వాటిని వెంటనే నిలిపివేయాలని రజక సంఘం నాయకులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని కోరారు. ఎఫ్టీఎల్ పరిధిలో మహిళా శక్తి క్యాంటీన్ కోసం నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. ఆయా నిర్మాణాలు వెంటనే నిలిపివేయించాలని, క్యాంటీన్ నిర్మాణానికి ముందు గతంలో ప్రభుత్వం రజకుల కోసం కేటాయించిందని గుర్తుచేశారు. రజక సంఘం నాయకులు శ్రీనివాస్, రాజశేఖర్, ప్రవీణ్, నరేదర్, యాదగిరి పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట: మేయర్



శ్మశానవాటిక ప్రహరీ శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 8వ డివిజన్ పరిధిలో రూ 20 లక్షల వ్యయంతో సోమవారం ముస్లింల శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్ ముజీబుద్దీన్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు సీసా వెంకటేశ్‌గౌడ్, చీరాల నర్సింహ్మా, నేతలు గుర్రాల వెంకటేశ్‌యాదవ్, మొహమ్మద్ మజార్, సయ్యద్ అజ్గర్, ఇస్మాయిల్ ఖాన్, మొహమ్మద్ ఇస్మాయిల్, యాకోబ్, గౌస్, ఆరిఫ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరిస్తాం...

నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు. మొత్తం మూడు దరఖాస్తులు రాగా వాటిని సత్వరం పరిష్కరిస్తామన్నారు.

స్ఫూర్తిప్రదాత కాళోజీ

- భవిష్యత్ తరాలకు ఆదర్శం
- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ప్రజల కోసం నిత్యం పరితపించిన కవితామూర్తి కాళోజీ భవిష్యత్ తరాలకు ఆదర్శమని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పుట్టుక నీది, చావు నీది బతుకంతా దేశానిది అన్న కాళోజీ మాటలు అందరికి ఆదర్శమని విజయేందర్‌రెడ్డి అన్నారు. ప్రజల కోసం తన కలం ద్వారా తెలంగాణ భాష, యాస ఎంత మంచిగుంటుందో రాసి, చూపించారన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ హరిప్రియ, వివిధ శాకల జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

మేడ్చల్‌లో...

మేడ్చల్: తెలంగాణ తెలుగు భాష అణచివేతకు నిరసనగా అలుపెరుగని పోరాటం చేసిన ఘనత కాళోజీ నారాయణరావుది అని మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా కౌన్సిలర్‌లు, అధికారులతో కలిసి ఆమె మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజల సమస్యలను తన సమస్యగా పరిగణించి నా గొడవ వంటి పుస్తకాలతో ప్రజలను చైతన్యపరిచిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. కమిషనర్ నాగిరెడ్డి కౌన్సిలర్లు దేవరాజు, గణేశ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, హరికృష్ణయాదవ్, కొడే మహేష్, నాయకులు మల్లేష్‌గౌడ్, శ్రవణ్‌కుమార్‌గుప్తా, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి..



జూబ్లీహిల్స్ పబ్లిక్‌స్కూల్‌లో...

తెలుగు భాషను కాపాడుకోవాలి...

కీసర: కాళోజీ నారాయణరావు జయంతిని రాంపల్లిలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బి.పద్మజారావు మాట్లాడుతూ... అవసరాలకు, చదువుకోవటానికి ఇంగ్లిష్ భాష నేర్చుకున్నా, తెలుగు మర్చిపోకూడదని, నిత్య వ్యవహారాలకు మన తెలుగునే వాడుకోవాలన్నారు. భాషపై పట్టును సాధించాలని మనకు అపారమైన సాహిత్యం ఉందని అన్నారు. దానిని కాపాడుకోవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, పాటలు, నాటకాలు మొదలైన అంశాలను ప్రదర్శించారు. వివిధ సంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.